# బేబీ చీటింగ్

-శ్రీగంగ

మహతికి ట్రాఫిక్ సిగ్నల్ అంటే ఒళ్లు మంట.

తను రోజూ ఆఫీసుకి స్కూటీపై వెళ్తుంది. తలకి స్కార్ఫ్ కట్టుకుని దానిపై హెల్మెట్ పెడుతుంది. ముఖంపై ఎండ పడినా నల్లబడకుండా సన్‌స్క్రీన్ లోషన్ రాస్తుంది. చేతులకు రక్షణ కోసం మోచేతులు కూడా కవర్ అయ్యేలా పొడవాటి గ్లోవ్స్ తొడుక్కుంటుంది. అంత జాగ్రత్తగా తయారై వెళ్తుంది ఆఫీసుకి. రోడ్డుపై వున్న దుమ్ము, ధూళి తన ఆరోగ్యాన్ని పాడు చేయకుండా చాలా జాగ్రత్త తీసుకుంటుంది. అయినా సిగ్నల్ దగ్గర పడుతుంటే ఆమెకు భలే చిరాకు వేస్తుంది. తను వెళ్లే దారిలో మూడుచోట్ల సిగ్నల్స్ ఉంటాయి. ఒక్క చోట కూడా ఫ్లైఓవర్ లేదు. కార్పొరేషన్ వాళ్లను తిట్టుకోవడం మినహా ఏమీ చేయగలదు?

సిగ్నల్ దగ్గర పడుతుంటే అక్కడ ఆపకుండా వెళ్లడానికి వీలుగా గ్రీన్‌లైట్ వెలుగుతుంటే బావుంటుంది కదా అనుకుంటుంది. ఒక్కోసారి ఆమె టైమింగ్ బావుంటుంది. కానీ చాలాసార్లు ఆమెను ఎర్రలైటు వెక్కిరిస్తుంది.

ఆ రోజు కూడా సిగ్నల్ దగ్గర ఆగాల్సి వచ్చింది. ఆగినవాళ్ల చూసి వాణిజ్య నౌకలను ముట్టడించే సముద్రపు దొంగల్లా బిలబిలా వచ్చేసారు భిక్షగాళ్లు. కాళ్లకు, చేతులకు కట్లు కట్టుకుని కొందరు, చేతుల్లో గుక్కపట్టి ఏడుస్తున్న పసిపాపను ఎత్తుకుని ఒకరు, ఇంకా వీళ్లు కాక చిన్నపిల్లలు కూడా మురికి బట్టలు వేసుకుని ఈగల్లా ముసురుకుంటారు. చేతుల్లోని డబ్బాలను ఆడించి అక్కడ ఆగిన వాహనాల చోదకులలో జాలి పుట్టించి అడుక్కోవడం మొదలుపెడతారు.

కారులో వున్నవారు అద్దాలు ఎత్తి తమను తాము కాపాడుకోగలుగుతారు. కానీ మహతి లాంటి ద్విచక్ర వాహన చోదకులు మాత్రం వాళ్లకు అడ్డంగా దొరికిపోతారు. దూరం నుంచి ఆగితే ఫర్వాలేదు.

కానీ ఆమె చేతిని తాకి దీనంగా ఒక చూపు చూసి దానం చేయమంటుంటే వాళ్లకు చిరాకు వేస్తుంది 'ఎందుకు అలా ముట్టుకుంటూ ఉంటారు' అని.

పాలు తాగే పసిపాపని మురికిగా ఉన్న బట్టలలో చుట్టిపెట్టి అడుక్కునే అమ్మాయి కూడా వచ్చింది.

ఆ పాప ఏడుస్తోంది. ఈమధ్య మహతికి ఈ సీను చూస్తే చిరాకుతోపాటు మనసంతా దిగులుగా అయిపోతుంది. కావాలని ఆ ఏడుస్తున్న పిల్లని ఎత్తుకుని స్త్రీల దగ్గర అడుక్కుంటుంది ఆ అమ్మాయి. మహతి డబ్బులు ఇచ్చేవరకూ వదిలిపెట్టదు. ఎంత చిరాకుపడ్డా ఆమె ఎంతో కొంత దానం చేస్తుందని తెలుసు. ఎందుకంటే ఆమె కూడా ఒక స్త్రీయేకదా. అందులోను ఎత్తుగా ఉన్న మహతి పొట్ట స్పష్టంగా కనబడుతూనే వుంటుంది.

★★★

మహతి ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నది. అందుకే సెలవులకు ఇబ్బంది. అదే ప్రభుత్వ కార్యాలయమైతే కావాల్సినన్ని సెలవులు. మెటర్నిటీ లీవు ఇస్తారు. ఈ మధ్య కొత్తగా చైల్డ్ కేర్ లీవ్ అని మూడేళ్ల కాలం పూర్తి జీతం మీద సెలవు ఇచ్చే పద్ధతి కూడా ప్రవేశపెట్టారుట.

శలవు అడిగితే ఉద్యోగం ఉంటుందా ఊడుతుందా తెలియని పరిస్థితి. అందుకే నెలలు నిండుతున్నా ఆఫీసుకు వెళ్లవలసి వస్తోంది ఆమెకు.

లిఫ్ట్‌లో కీర్తి కనిపించి పలకరించింది.

"గుడ్‌మార్నింగ్"

"హాయ్ గుడ్‌మార్నింగ్. అయినా మన బాసు మూడ్‌నిబట్టి కదా గుడ్డా, బ్యాడా అని తెలిసేది" అంది మహతి.

"ఆ ముసలాడు అంతేలేవే. ఇక్కడే ధుమధుమలాడుతూ ఉంటాడు. ఇంట్లో పప్పులుడకవు కదా" అంది కీర్తి.

"డాక్టర్ దగ్గరకు వెళ్తున్నావా?" అడిగింది కీర్తి.

"ఊ...వెళ్తున్నాను"

"ఏమంటున్నారు? డేట్స్ ఇచ్చారా?"

"వచ్చే పదహారుకి డేట్ చెప్పారు"

"ఇంకెంత? పదిరోజులుంది అంతేకదా. సెలవు పెట్టేయ్"

"ఈరోజు బాసును అడగాలనుకుంటున్నాను. ఏమంటాడో?"

"భయపడకే. ఆయనా మనిషేగానీ రాక్షసుడు కాదుగా"


"విష్ మీ ఆల్ ద బెస్ట్"

"ఆల్ ద బెస్ట్"

తన క్యూబికల్‌లో కూర్చుని పని చేసుకుంది కొంచెంసేపు.

తరువాత ఆఫీసు బాయ్‌ని పిలిచి బాసు ఫ్రీగా ఉన్నాడా అని అడిగింది. ఉన్నాడని చెప్పాడు.

తనకు గుర్తుకొచ్చిన దేవుళ్లకు దణ్ణం పెట్టుకుని బాస్ రూమ్‌లోకి వెళ్లింది.



మహతి లోపలకు వెళ్లడం చూసి కీర్తి టెన్ష న్‌గా ఎదురుచూసింది ఆమె రాకకోసం.

కొంచెంసేపటికి నవ్వుతూ బయటకు వచ్చింది మహతి.

తనకోసం చూస్తున్న కీర్తి దగ్గరకు వెళ్లి "సెలవు ఇచ్చారే" అంది.


"కంగ్రాట్స్. అది నువ్వు చెప్పకుండానే తెలిసిపోతోంది" అంది నవ్వుతూ.

★★★

సతీష్ తల్లిదండ్రులు పల్లెటూరిలో వుంటారు. వాళ్లకి అతడు ఒక్కడే కొడుకు. వారికి అతను తప్ప మరి ఎవ్వరూలేరు. సతీ ష్‌కి వాళ్లను తెచ్చి తన ఇంట్లో వుంచుకోవాలని వుంటుంది.

కానీ మహతి అభ్యంతరం చెప్పేసరికి వాయిదా వేస్తున్నాడు.

భార్యకు తెలియకుండా తల్లిదండ్రులకు డబ్బు పంపిస్తుంటాడు.



మహతి డెలివరీకి ఆమెను పుట్టింటికి తీసుకువెళతామని ఆమె అమ్మా నాన్న పిలిచారు. కానీ ఉద్యోగం వదిలి వెళ్లలేక మహతి పనిమనిషి సాయంతో అలాగే నెట్టు కొస్తోంది.

సతీష్ కూడా తనకు చేతనైనంత వరకూ పనుల్లో సాయం చేస్తు న్నాడు.

కానీ మహతి డెలివరీ డేట్ దగ్గర పడుతుంటే అతనికి ఏదో తెలియని భయం కలిగింది.

మహతితో మాట్లాడి ఎలాగోలా ఒప్పించి తన తల్లిదండ్రులను సహా యంగా రమ్మని పిలిచాడు.

కొడుకు తమను ఇంట్లో ఉండ మని రమ్మనేసరికి ఆ దంపతులు ఎంతో సంతోషపడ్డారు.

తాము పట్నం వెళ్లిపోతున్నామని, ఇక అక్కడే కొడుకు కోడలుతో ఉంటామని ఊర్లో అందరికీ పేరుపేరునా చెప్పారు. కొడుకు ఇంటికి వచ్చాక వాళ్లిద్దరూ ఇంటి పని అంతా తమపైనే వేసుకున్నారు. ఇంట్లో పెద్ద దిక్కు వుంటే ఎంత బావుంటుందో సతీష్‌కి, మహతికి తెలిసి వచ్చింది.

మహతి డెలివరీ అయ్యే సమయం దగ్గరపడింది. కాన్పు కష్టమవుతుం దని డాక్టరు ముందే బెదరగొట్టి సిజేరియన్ చేసింది. మంచిరోజు, టైమ్ కూడా చూసుకోమని సలహా కూడా ఇచ్చింది. ముందు ముందు మెటర్నిటీ హాస్పిటల్స్‌లో మందుల షాపుల పక్కనే జాతక చక్రాలు వేయడానికి, సిజే రియన్లకు ముహూర్తాలు పెట్టడానికీ పురోహితులు కూడా కన్సల్టెన్సీ తెరు స్తారేమో!

డెలివరీ అయిన తరువాత మహతికి, పుట్టిన పాపకి సతీష్ తల్లి చేయవ లసినవన్నీ ఎంతో శ్రద్ధగా చేసింది.

తన తల్లి వచ్చి ఉన్నా అంతకంటే బాగా చేయలేదేమో అని మహతికి కూడా అనిపించింది.

మహతి తల్లి అమెరికాలో వుంటున్న కొడుకును చూడడానికి వెళ్లింది. ఆమెను తన భార్య డెలివరీకి సహాయంగా వుంటుందని పిలిపించుకు న్నాడు అతను.

మారుతున్న కాలంలో అవసరానికి ఎంతవరకు ఉపయోగపడతాయి అనేదానినిబట్టి మమతలు, అనుబంధాలు రూపాంతరం చెందుతున్నాయి.

పాపకు తల్లిపాలు ఒక నెల మాత్రమే ఇచ్చింది మహతి.

అత్తగారు పాపం చెవిలో జోరిగలా చెప్పింది "పాపకి తల్లిపాలు తాగి స్తేనే మంచిది. అప్పుడే మానొద్దమ్మా" అని.

కానీ మహతి "నేను ఆఫీసుకు వెళ్లిపోతే పాపకి ఇబ్బంది అయిపో తుంది. అందుకే ముందునుంచే బాటిల్ ఫీడింగ్ అలవాటు చేస్తున్నాను" అని సమర్థించుకుంది. సతీష్‌కు కూడా పాపకి తల్లిపాలు ఇస్తే మంచిదని నమ్మకం. కానీ భార్యకి చెప్పలేక తన అభిప్రాయాన్ని తనలోనే దాచుకు న్నాడు.

***

పాపకు మూడవనెల వచ్చింది. మహతి సెలవు కూడా అయిపోవ చ్చింది. ఆఫీసుకి వెళ్లి జాయిన్ అయ్యేలోగా కొలీగ్స్‌కి, ఇరుగుపొరుగువా ళ్లకు పార్టీ ఇవ్వాలని అనుకుంది మహతి. ఆ ఉద్దేశ్యంతోనే బారసాల కాస్త ఘనంగా చేద్దామని అనుకుంది మహతి. సతీష్ కూడా సరేనన్నాడు.

ఇరుగుపొరుగువాళ్లను, తన స్నేహితులను పిలిచింది మహతి. వారితో పాటు తన బాస్‌ను కూడా ఆహ్వానించింది. సతీష్ కూడా తన స్నేహితు లను పిలిచాడు.

ఆ రోజు పార్టీకి కావాల్సిన ఏర్పాట్లు చూడడానికి సతీష్ ఆఫీసుకి సెలవు పెట్టి ఇంట్లో వుండిపోయాడు.

ఇంటిని బాగా అలంకరించాడు సతీష్. అతని తండ్రి కూడా సతీష్‌కి బాగా సాయం చేసాడు. ఇంటికి వచ్చే అతిధులకోసం ఇల్లు అంతా శుభ్రం చేసింది సతీష్ తల్లి.

పార్టీకి రెండురకాల స్వీట్స్, రెండురకాల హాట్స్ చేయించింది మహతి. గ్రాండ్‌గా వుంటుందని ఒక పెద్ద కేక్ కూడా ఆర్డర్ చేసింది. నాలుగు బేకరీలు తిరిగి బోలెడన్ని ఫోటోలు చూసి అప్పుడు ఆ కేక్ ఫైనల్ చేసింది. రెండు అంతస్థులతో మంచి ఆకర్షణీయమైన అలంకరణలతో చాలా బాగుంది ఆ కేకు.

పాపను తెచ్చి ఊయలలో వేసింది సతీష్ తల్లి. సాదాగా ఉన్న చీర కట్టు కుందామె.

తన దగ్గర ఉన్న వాటిలో అదే మంచిది. కానీ ఆ చీరలో ఆమెను చూసి అక్కడున్నవారెవరూ ఆమెను మహతి అత్తగారు అనుకోలేదు. మహతి కూడా ఆమెను ఎవరికీ పరిచయం చేయలేదు.

మహతిలానే పాప కూడా తెల్లగా, దంతపు బొమ్మలా వుంది. అందరూ మహతిని, ఆమె అందమైన పాపని మెచ్చుకున్నారు. ఆ అభినందనల మత్తులో మహతికి నల్లగా ఉన్న అత్తగారు పనిమనిషి కంటే తక్కువగానే కని పించింది.

చీటికిమాటికి చిరాకు పడుతూ ఆమెను అది తెమ్మని, ఇది తెమ్మని ఆజ్ఞలు జారీ చేసింది.

సతీష్ తండ్రి అదృష్టవంతుడు. ఆయన సెల్లార్‌లోకి వెళ్లి ఓ ప్రక్కగా కూర్చుని ఆనందంగా చుట్ట కాల్చుకుంటున్నాడు. సహజంగా బిడియ స్థుడు కనుక అంతమంది జనాల్లో ఊపిరి ఆడదని పార్టీలో ఉండకుండా

## ఆటో డ్రైవర్ దాతృత్వం

నాగపూర్‌లో చాలామంది సెల్‌ఫోన్స్‌లో ఒక ఆటో డ్రైవర్ నెంబర్ ఎమ ర్జన్సీ ఫోన్ నెంబర్‌గా నమోదయి వుంటుంది. 32 ఏళ్ల దిలీప్ ఇంగ్లీ అనే ఆ ఆటో డ్రైవర్ 24 గంటలూ అందరికీ అందుబాటులో ఉంటున్నాడుట. ఆక్సి డెంట్, పురుడు, ప్రమాదం, అకస్మాత్తుగా జబ్బు చేయడం...ఇలా ఏ అవ సరం వచ్చినా అతనికి ఫోన్ చేస్తే చాలు వెంటనే గుమ్మంలోకి వచ్చి వాళ్లని ఆసుపత్రికి ఉచితంగా తరలిస్తుంటాడు. రోజూ అతను ఆదా చేసే 20 రూపాయలని దానం చేస్తుండడం అతని భార్య సమర్థిస్తోందిట.


## టీచర్లకి యూనిఫారాలు

ఒరిస్సాలోని గంజాం జిల్లాలోని 501 ప్రభుత్వ పాఠశాలల్లో (పిల్లలకి ఇదివరకే యూనిఫారాలున్నాయి) ఇటీవల టీచర్లు అందరికీ కూడా యూనిఫారాలు ఉండాలని ప్రభుత్వం తాఖీదులిచ్చిందిట. మగ టీచర్లకి తెల్ల షర్టులు, నల్ల ప్యాంట్లు, ఆడ టీచర్లకి మెరూన్ కలర్ బోర్డరున్న ఆలివ్ గ్రీన్ చీరలు. పిల్లల్ని క్రమశిక్షణలో పెట్టే టీచర్లకి కూడా నిబద్ధత కావాలని యూనిఫారాలని కంపల్సరీ చేసారుట.

## పెరూలో వింత ఆచారం

పెరూలోని పురాతన ఇన్కా ఇండియన్ల వివాహాలలో వధూవరులు ఒకరి చెప్పులు ఇంకొకరు మార్చుకుంటే పెళ్లయినట్లుగా భావించేవారట.

-తటవర్తి



తప్పించుకున్నాడు. పార్టీ జరుగుతోంది. సతీష్ కేక్ తెచ్చి టీపాయ్‌మీద పెట్టాడు.

"బర్త్‌డేకి కేక్ బావుంటుందిగానీ బారసాలకెందుకే?" అంది కీర్తి.

"బారసాల అంటే తల్లికి పిల్లకూ అభినందన సభలాంటిది. ఇది మీ స్నేహితురాలు మహతి అచీవ్‌మెంట్‌కి నేనిస్తున్న చిరుకానుక అనుకోండి" అన్నాడు సతీష్ నవ్వుతూ.

"బావుంది. భార్యను అందంగా సమర్థించే భర్త" అని చప్పట్లు చరిచాడు మహతి బాసు.

అతిథులంతా బిగ్గరగా నవ్వారు.

"అయితే కేండిల్స్ నువ్వే ఊదు" అంది కీర్తి.

"నా విజయంలో భాగస్వామి సతీష్. ఇద్దరం కలసి ఊదుతాం" అంది మహతి.

"ఇది ఇంకా బాగుంది. భర్తని సమర్థించే అందమైన భార్య" అన్నాడు మహతి బాసు, తను అంతకుముందు అన్న మాటలనే అటూ ఇటు చేసి వాడుతూ.

ఆయన చమత్కారానికి మరోసారి అతిథి బృందం చప్పట్లతో అభినందనలు తెలియజేసారు.

ఆ సందడి మధ్య మహతి, సతీష్ కాండిల్ ఊదారు. ఊయలలోని పాప తనలో తనే నవ్వుకుంటూ ఊయలకు కట్టిన రంగురంగుల ప్లాస్టిక్ గచ్చకాయలని అందుకోవడానికి చేతులు చాచి ఆడుకుంటోంది. కేక్ కట్ చేసి సతీష్‌కి పెట్టబోయింది మహతి. అది అందుకుని ఆమె నోటికి అందించాడు సతీష్. తరువాత ఆ కేక్‌ను కట్‌చేసి పెట్టాడు.

మహతి ఆకేకు ముక్కల్ని ప్లేట్లలో పెట్టి తెమ్మని చెప్పింది సతీష్ తల్లితో.

సతీష్ తల్లికి సాయంగా ఆ కేకును కిచెన్‌లో పెట్టి వచ్చాడు. కొంచెంసేపటికి సతీష్ తల్లి ప్లేట్లలో తెచ్చిన కేకు ముక్కల్ని చూసి మహతికి ఒళ్లు మండిపోయింది.

అవి నీట్‌గా కట్ చేసిన కేకుముక్కల్లాలేవు. సంక్రాంతికి ముగ్గులపై పెట్టే గొబ్బెమ్మల్లా ఉన్నాయి.

సతీష్ తల్లి చేతుల నిండా కేకు పైన ఉండే క్రీము అంటుకుని ఉంది.

కోపం తట్టుకోలేక "ఛీ...పల్లెటూరి బైతులు. వద్దన్నా వినకుండా తెచ్చి ఇంట్లో పెట్టారు" అని అరిచింది.

ప్రమాదాన్ని శంకించిన సతీష్ వెంటనే తన తల్లిని తీసుకుని కింద సెల్లార్‌లో వున్న తండ్రి దగ్గరకు వెళ్లాడు.

తన తప్పు ఏమిటో అర్థం కాని ఆ పిచ్చి తల్లి అయోమయంగా చూస్తూ ఉండిపోయింది.

***

పార్టీ ముగిసిన తరువాత కూడా మహతి మామూలుగా ఉండలేకపోయింది. సతీష్‌కి స్పష్టంగా చెప్పింది 'ఈ ముసలాళ్లు ఇక్కడ ఉంటే తను వేరే రూమ్ తీసుకుని వెళ్లిపోతాను' అని.

"నువ్వు ఆఫీసుకు వెళ్లాక పాపను చూసుకోవడానికైనా అమ్మ కావాలి కదా" అన్నాడు సతీష్ తన ఆఖరి అస్త్రాన్ని ప్రయోగిస్తూ.


"ఏమీ అక్కర్లేదు. డబ్బు పారేస్తే పాపను చూడడానికి బేబీ సిట్టర్ దొరుకుతుంది" అంది మహతి తేలిగ్గా.

పల్లెటూరికి పంపితే తల్లిదండ్రులు ఊర్లో పదిమంది ముందు చులకన అవుతారు. తనకు కూడా మాట వస్తుంది అని ఆలోచించి సతీష్ తల్లిదండ్రులను దగ్గరలో వున్న వృద్ధాశ్రమంలో చేర్పించాడు. పసిదాన్ని చూసుకోవడానికి మహతి ఒక బేబి సిట్టర్‌ని పెట్టుకుంది.

జీతం ఎక్కువేగానీ మనిషి శుచి శుభ్రం తెలిసినదానిలా ఉంది. మహతికి నచ్చింది. వేళకు పాపాయికి ఫీడ్ ఇవ్వడం, బట్టలు మార్చడం, స్నానం చేయించడం, ఆడించడం వంటి పనులన్నీ ఆమె సమర్థంగా చేయగలదని నమ్మకం చిక్కిన తరువాతనే మోనాని పనిలో పెట్టుకుంది.


మోనాకి పాప బాగా మచ్చికయింది. పాప స్వతహాగా నెమ్మది. బాగా ఆకలి అయినప్పుడో, మరేదైనా ఇబ్బంది కలిగినప్పుడోతప్ప మామూలుగా ఉన్నప్పుడు నవ్వులు రువ్వుతుంటుంది.

పాపను మోనా బాగా చూసుకుంటుందన్న నిశ్చింతతో శెలవులు అయిపోగానే డ్యూటీలో జాయిన్ అయిపోయింది మహతి. మళ్లీ ఎప్పటిలా తయారై స్కూటీపై ఆఫీసుకు వెళ్లసాగింది.



## మొహమాటంలేని కాజోల్

కాజోల్‌కి ప్రేక్షకుల్లో తనదైన గుర్తింపు వుంది. అందుకనే పాత్రల ఎంపికలో ఎలాంటి మొహమాటాలకి పోనని ఒకటికి రెండుసార్లు చెబుతుంటుంది. అందుకు తాజా ఉదాహరణ- '3 ఇడియట్స్' సినిమాని ఆమె తిరస్కరించడమే. నిజానికి '3 ఇడియట్స్' అంత విజయాన్ని సాధించినా అందులోని హీరోయిన్‌కి తగిన ప్రాధాన్యత లేదని, ఈ కారణంగానే తను ఆ సినిమాని వదులుకున్నట్టు చెబుతుంది కాజోల్.




అయితే ఎందుచేతనో ఇప్పుడు ఆమెకు ట్రాఫిక్ సిగ్నల్స్ దగ్గర ఆగడం అంత చిరాకుగా అనిపించడంలేదు.

బహుశా అది పసిపాపను ఎత్తుకుని అడుక్కునే బిచ్చగత్తె కనిపించకపోవడంవలనా? లేక ఇప్పుడు ఆమె ప్రెగ్నెంట్ కాకపోవడంవలనా అనేది ఆమెకు కూడా తెలియదు.

★★★


ఆఫీసుకు వెళ్లినా మహతికి పాప ఎలా వుంది అనే ధ్యాస. ఎప్పుడూ మోనా మొబైల్‌కి ఫోన్ చేసి పాప గురించి అడిగేది. పాప నిద్రపోతోందనో, టీవీ చూస్తోందనో, బొమ్మలతో ఆడుకుంటోందనో చెప్తూ ఉండేది మోనా. పాప మెలకువగా వున్నప్పుడు పాపతో మాట్లాడతారా? అని మోనా అడిగితే వద్దులే అనేది మహతి.

సెల్‌ఫోన్‌ల నుంచి వచ్చే రేడియేషన్ పాపకు హాని చేస్తుందేమో అని ఆమె భయం.



## తల్లి అయిన అమృతా!

సల్మాన్ సోదరుడు అర్బాజ్ ఖాన్‌కి భార్య మలైకా అరోరా అనీ ఆమె మోడలింగ్, ఐటమ్ నంబర్లు చేస్తుంటుందని అందరికీ తెలిసిందే. అలాగే మలైకా చెల్లెలు అమృతా అరోరా కూడా కొన్ని చిత్రాల్లో హీరోయిన్‌గా ఐటమ్ గాళ్‌గా చేసింది. గత ఏడాది మార్చిలో ముంబయిలోని షకీల్ లడాక్ అనే బిల్డర్‌ని పెళ్లాడిన అమృతా అరోరా ఇటీవలే ఓ ఆడపిల్లకి జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగానే వున్నారని వార్తలు చెబుతున్నాయి.




రోజురోజుకి పాప రంగు తగ్గుతుంటే మహతికి ఆందోళన పెరిగింది. మోనా పాపకి సరిగ్గా ఒళ్లు రుద్ది స్నానం చేయించడం లేదేమో అని అనుమానం వచ్చింది. పాప ఒళ్లంతా బాగానే వున్నా ముఖం మాత్రం వడిలిపోయి కనబడుతోంది.

ఇంట్లో దోమలు పెరిగాయో ఏమిటో అక్కడక్కడ పాప ఒంటిపైన ఎర్రటి గాట్లు కనబడేవి.

మహతికి తన అత్తగారు తరచుగా జ్ఞాపకం రాసాగింది. ఆమె ఉన్నప్పుడు పాప చాలా ఆరోగ్యంగా ఉండేది. ఇంటికి ఎవ్వరైనా వచ్చినా పాపను చూసి వెళ్లాక పాప కొంచెం నలతగా అనిపిస్తే ఆమె వెంటనే దిష్టి తీసేది. చక్కగా స్నానం చేయించేది. పాప హాయిగా నిద్రపోయేది, ఆరోగ్యంగా పెరిగేది. కానీ మోనా చేతిలో పాప సంరక్షణ సవ్యంగా జరగడంలేదేమో అన్న అనుమానం ఆమెలో బలపడసాగింది.

ఒకరోజు ఆఫీసులో మహతికి పాప గురించిన ఆలోచనలతో తల వేడెక్కిపోయింది. ఏ పనీ చేయబుద్ధికాలేదు.

సతీష్‌కి ఫోన్ చేసి మాట్లాడదామంటే అతను వారంరోజుల ట్రైనింగ్‌కి వెళ్లాడు. ఇంకో రెండురోజులకుగానీ రాడు.

కీర్తితో చెప్తే 'పర్మిషన్ తీసుకుని వెళ్లు. ఏమైనా అర్జంట్ పనులుంటే నేను మేనేజ్ చేస్తాను' అంది.

మోనాకి ఫోన్ చేసి పాప ఏం చేస్తోంది అని కనుక్కుంది. పాప నిద్రపోతోందని చెప్పింది మోనా.

ఎందుకో మహతికి ఆఫీసులో ఉండాలనిపించలేదు. కీర్తి చెప్పినట్లు బాస్ పర్మిషన్ తీసుకుని ఇంటికి బయలుదేరింది. మహతి ఇంటికి వెళ్లే దారిలో ఉన్న ఆఖరు ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర రెడ్‌లైట్ పడింది. ఆమె స్కూటీ ఆపింది. పసిపాపను ఎత్తుకుని వాహన చోదకుల దగ్గర అడుక్కుంటున్న స్త్రీ మహతివైపు రాలేదు.

కానీ ఆమె చేతుల్లో ఉన్న పాప ఏడుపు మాత్రం మహతి చెవిలో పడింది, గుండెలను తాకింది. ఆమెకు తన పాప గుర్తుకు వచ్చింది. లైట్ గ్రీన్‌కి మారగానే స్కూటీ స్టార్ట్ చేసింది మహతి. ఎందుకు ఆ బిచ్చగత్తె తన దగ్గరకు రాలేదు అని ఆలోచించింది. బహుశా తను చిరాకు పడుతుందనే విషయం గుర్తుకువచ్చిందేమో అనుకుంది. ఆలోచనలతోనే ఇంటికి వచ్చింది. మోనా గుమ్మంలోనే ఎదురైంది.

"పాప ఎలా వుంది?" అడిగింది, మోనా ముఖంలో ఆందోళన చూసి మహతి కీడు శంకించింది.

"బాగానే వుందమ్మా. మా అక్క పాపకు తాయెత్తు కట్టిస్తానని ఫకీర్ బాబా దగ్గరకు వెళ్లింది. మీరు రెస్టు తీసుకోండమ్మా" అంది మోనా.

ఆమె గొంతులో నిజాయితీలేదు. ఏదో జరగరానిది జరిగిందని మహతికి భయం వేసింది.

మోనాని నిలదీసి అడుగుదామనుకుంది. ఇంతలో మొబైల్ రింగయింది. మహతి ఫోన్ తీసి చూసింది.

కీర్తి పేరు కనిపించింది. ఫోన్ ఆన్ చేసి "హలో" అంటూ బెడ్రూమ్‌వైపు నడిచింది.

మోనా మళ్లీ వీధి గుమ్మంవైపు వెళ్లింది తన అక్క కోసం ఎదురుచూడడం కోసం.

"ఎక్కడున్నావే?" అంది కీర్తి.

"ఇప్పుడే ఇంటికి వచ్చాను. పాపను మోనా వాళ్ల అక్క తాయెత్తు కట్టించడానికి ఎక్కడికో తీసుకువెళ్లిందిట. నాకు ఎందుకో భయమేస్తోందే?" అంది మహతి ఆందోళనగా.

"సరేలే...నువ్వేమీ కంగారుపడకు. నేను పనినిముషాల్లో నీ దగ్గర ఉంటాను. మోనాని ఏమీ కంగారు పెట్టకు'' అంది కీర్తి.

"నాకేమో కంగారుగా ఉందే'' అంది మహతి.

"అబ్బా...అందుకేగా వస్తున్నాను. నువ్వు కంగారులో ఏం మాట్లాడతావో నీకే తెలియదు. మోనాని బెదరగొట్టకు'' అని ఫోన్ కట్ చేసింది.

మహతి బయటకు వచ్చి చూసింది. మోనా బయట నుంచుని రోడ్డు వైపు చూస్తోంది.

మహతి కంగారు పెట్టవలసిన అవసరం లేకుండానే మోనా చాలా బెదురుచూపులు చూస్తోంది. కీర్తి వస్తానని అంది కాబట్టి మహతికి ధైర్యం వచ్చింది.

"మోనా... రా లోపల కూర్చుందాం'' అని హాల్లోకి నడిచింది. మోనా లోపలకు వచ్చి తలుపు పక్కనే కూర్చుంది.

కొంతసేపటికి కాలింగ్‌బెల్ మ్రోగింది.

దిగ్గున లేచి తలుపు తీసింది మోనా. ఎదురుగా పోలీసుని చూసి భయంతో ఒక అడుగు వెనక్కి వేసింది.

ఇనస్పెక్టర్ డ్రెస్‌లో వున్న ఉదయ్‌ని చూసి మహతి గుండె ఒక క్షణం ఆగినట్లనిపించింది. ఉదయ్ కీర్తి భర్త. అసలే పాప ఇంట్లో లేదని కంగారు పడుతుంటే ఆ క్షణంలో ఉదయ్ కనిపించడం ఆమెకు భయాన్ని కలిగించింది.

ఆమె కంగారు చూసిన ఉదయ్ నవ్వుతూ "కంగారు పడకండి'' అంటూ పక్కన వున్న కానిస్టేబుల్‌కి సైగ చేసాడు. అతను జీపులోంచి ఒక స్త్రీని తీసుకువచ్చాడు.

ఆమె చేతిలో ఒక పాప వుంది. ఆ పాపను అందుకుని మహతికి ఇచ్చాడు ఉదయ్.

మహతి పాపను అందుకని ఆశ్చర్యపోయింది తన పాప ఆ స్త్రీ చేతిలో ఉండడమేమిటా అని. ఆ స్త్రీ ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర వాహన చోదకుల దగ్గర పసిపాపను చూపి అడుక్కునే స్త్రీ. ఆమెను చూసి మోనా ముఖం పాలిపోయింది.

అంతలో కీర్తి కూడా తన స్కూటీపై వచ్చింది. మోనాను, బిచ్చెగత్తెను పోలీసులు అరెస్టు చేసారు. ఉదయ్ మహతి చేత రాతపూర్వకంగా కంప్లైంట్ తీసుకుని వెళ్లిపోయాడు.

తరువాత కీర్తి అన్ని వివరాలు మహతికి చెప్పింది. హడావుడిగా పాపను తీసుకుని ఒక బిచ్చగత్తె ఆటో ఎక్కుతుండడం చూసి అటుగా వస్తున్న ఉదయ్ జీపు ఆపి విచారణ చేసాడు. పాపను గుర్తుపట్టి ఎందుకైనా మంచిదని మహతిని కనుక్కోమని కీర్తికి ఫోన్ చేసాడు. అసలు విషయం ఏమిటంటే ఆ బిచ్చెగత్తె, ఈ మోనా ఒకే బస్తీలో ఉంటారు. మోనా ఇదివరకు కూడా ఇలా పసిపాపలను ఆ బిచ్చగత్తె వాడుకోవడానికి ఇస్తుండేది. ఊరికే కాదు రోజుకి వంద రూపాయల అద్దెకి.

మహతి ఇంటికి వెళ్తుండడం ఆ బిచ్చగత్తె గమనించి మోనాకి ఫోన్ చేసి హెచ్చరించింది. పాపను మోనాకు అప్పగించాలనే తొందరలో ఆటో పిలిచి ఎక్కింది. అప్పుడే ఉదయ్ కంటపడింది.

ఇది ఏదో చెదురుమదురు సంఘటన కాదు. అది ఒక పక్కా ప్రణాళికతో నడుస్తున్న నీచమైన వ్యాపారం. పాపలు ఏడవకపోతే వాళ్లు పాపలను గిచ్చుతుంటారని తెలిసి మహతికి కన్నీరు ఆగలేదు.

కన్నీటితోపాటు కోపం కూడా వచ్చింది మహతికి. పాప రంగు తగ్గడం, ఒంటిపై రక్కులు కనిపించడం గుర్తుకువచ్చి మనసంతా చేదుగా అయిపోయింది. ఆ రాత్రంతా నిద్ర పట్టలేదు మహతికి. పాపను పక్కన పడుకోబెట్టుకుని ఆలోచిస్తూ గడిపింది. ఉద్యోగం మానడం లేదా బాస్‌ను బతిమాలి దీర్ఘకాలం సెలవు పెట్టడం... అన్నీ ఆలోచించింది. చివరకు ఒక నిర్ణయానికి వచ్చి హాయిగా నిద్రపోయింది.


***

సతీష్ ట్రైనింగ్ నుంచి ఆదివారం ఇంటికి వచ్చేసరికి సెల్లార్‌లో తన తండ్రి ఒక మూలగా కూర్చుని తన్మయత్వంగా చుట్ట కాల్చుకుంటూ కనబడేసరికి ఆశ్చర్యపోయాడు.

ఏమి జరిగి వుంటుందా అని ఆలోచిస్తూ పైకి వెళ్లేసరికి హాల్లో మహతి అత్తగారితో కబుర్లు చెప్తూ నవ్వుతూ కనిపించింది.

అత్తాకోడళ్లను కలిపిన పాప ఊయలలో హాయిగా నిద్రపోతూ కనిపించింది.

☆



## డబ్బు వర్షం

ఇండోనేషియాలో తుంగ్‌దేశిమ్ వారింజన్ అనే వ్యాపారస్థుడు బిజినెస్ మోటివేషన్ మీద ఇటీవల తను వ్రాసిన పుస్తకాన్ని ప్రమోట్ చేయడానికని సెరాంగ్ సిటీలోని ఫుట్‌బాల్ స్టేడియం మీద తన విమానాన్ని నాలుగుసార్లు చక్కర్లు కొట్టిస్తూ 10 కోట్ల విలువైన రుపయ్యా నోట్లని (మనకు 4.5 లక్షల రూపాయలకి సమానం) క్రిందకు వెదజల్లాడట. ఈ సంఘటనకి ముందే పబ్లిసిటీ ఇవ్వడం మూలంగా జనాలు ఆ నోట్ల కోసం పరుగులు పెడుతుండగా 13 పిల్ల బాలిక ఆ తొక్కిసలాటలో గాయపడి ఆసుపత్రిపాలయిందట కూడా.

-తటవర్తి

